బడి తెరిచే నాటికి పనులు పూర్తి

ప్రభుత్వ పాఠశాలలకు కనీస సౌకర్యాలు కల్పించి సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కనీస మరమ్మతు పనులు ప్రారంభించింది. దీనికోసం పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను వేసి వారి పర్యవేక్షణలో పనులు జరిగేలా ప్రణాళిక రూపొందించింది. పాఠశాలలు ప్రారంభానికి ముందే నిర్దేశించిన పనులను పూర్తి చేసేలా అధికారులను పురమాయించింది. ప్రస్తుతం నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

- పాఠశాలల్లో చకచకా మరమ్మతు పనులు
- మారుతున్న బడుల రూపురేఖలు


జూలూరుపాడు: అనంతారం ప్రాథమికోన్నత పాఠశాల

ఇల్లెందురూరల్: మండలంలో 115 పాఠశాలలు ఉండగా అందులో 51 పాఠశాలల్లో మౌలిక వసతులు లేవని గుర్తించి ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ఆయా పాఠశాలలకు రూ.1.72 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులను ముఖ్యంగా పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, తరగతి గదులకు మరమ్మతు వంటి కనీస సౌకర్యాలు కల్పించేందుకు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఎంపిక చేసిన పాఠశాలలకు మంజూరైన నిధులలో 25శాతం నిధులను ప్రభుత్వం ముందస్తుగా విడుదల చేసింది. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో బ్యాంకు ఖాతాలను తెరిపించింది. తొలి విడత నిధులను వారి ఖాతాలో జమ చేసింది.

వేగంగా పనులు..

ఎంపిక చేసిన 51 పాఠశాలల్లో నిర్దేశిత పనులను మే మొదటి వారంలో ప్రారంభించారు. పాఠశాలలు జూన్ 12వ తేదీన ప్రారంభిస్తుండటంతో 10వ తేదీ నాటికి పూర్తి చేసేలా ముందస్తు ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది. ఇందులో భాగంగా విద్యాశాఖ, మండల పరిషత్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, మహిళా సమాఖ్య అధ్యక్షుడు నిరంతర పర్యవేక్షణతో పనులు వేగవంతంగా సాగేలా కృషి చేస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు సైతం నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు నాణ్యతా ప్రమాణాలతో సాగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 51 పాఠశాలలకు గాను 18 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లోనూ పనులు చివరి దశకు చేరుకున్నాయి.

తుది మెరుగులపై కసరత్తు...

ప్రస్తుతం నిర్దేశిత మరమ్మతు పనులు పూర్తి చేసిన పాఠశాలల్లో తుది మెరుగులు దిద్దాలని ప్రభుత్వం ఆదేశించింది. పాఠశాలకు నూతన కళ సంతరించుకునేలా రంగులు అద్దాలని, దీనికోసం అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు ప్రభుత్వం సూచించింది.

నిధుల లేమితో మన ఊరు.. మనబడి..

గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక హంగులు, సకల సౌకర్యాలతో తీర్చిదిద్దాలన్న సంకల్పంతో మన ఊరు – మన బడి పేరుతో పాఠశాలల మరమ్మతు పనులు ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా మండలంలో 30 పాఠశాలలను ఎంపిక చేసింది. గత ఏడాది పనులు ప్రారంభించిన వాటిలో మరమ్మతులు పూర్తైన మూడు పాఠశాలలను అట్టహాసంగా ప్రారంభించారు. ఆ తరువాత 20 వరకు పాఠశాలల్లో 90 శాతం వరకు పనులు పూర్తి చేశారు. కేవలం మూడు పాఠశాలల్లో మాత్రమే పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఇంజనీరింగ్ శాఖ అధికారులు చెపుతున్నారు. అయితే 30 పాఠశాలల్లో పనుల కోసం ప్రభుత్వం రూ.6.27 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు కేవలం రూ.1.50 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. పనులు చేసిన కాంట్రాక్టర్లు మాత్రం నిధుల విడుదల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

జూలూరుపాడు: మండలంలో 55 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో కేజీబీవీ-1, ఏజీహెచ్ఎస్-1, గిరిజన ప్రాథమిక పాఠశాలలు-6, శిథిలావస్త భవనాలు ఉన్న పాఠశాలలు-3, ఆరుగురు విద్యార్థులు కంటే తక్కువ ఉన్న పాఠశాలలు -2, మన ఊరు -మన బడి కార్యక్రమం కింద అభివృద్ధి పరిచిన పాఠశాలలు-17 పోను మిగిలిన 25 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అమ్మ – ఆదర్శ పాఠశాల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మొదటి విడతలో అమ్మ – ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన 25 పాఠశాలల్లో అభివృద్ధి పనులు టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్‌శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. యూడైస్ ఆధారంగా పాఠశాలల్లో అవసరాలను గుర్తించి పనులు చేపడుతున్నారు. పాఠశాలల్లో తాగునీటి సరఫరా, తరగతి గదులు, టాయిలెట్స్, వంట షెడ్ల మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం కల్పించి తరగతి గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయడం వంటి పనులు జరుగుతున్నాయి. స్వయం సహాయ సంఘానికి చెందిన గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు అమ్మ-ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా నియమించారు. 25 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అమ్మ-ఆదర్శ పాఠశాల పనుల కోసం ప్రభుత్వం రూ 1.01 కోట్ల నిధులు కేటాయించింది. 23 పాఠశాలల్లో అమ్మ-ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు పనులు చేస్తుండగా జూలూరుపాడు, కాకర్ల హైస్కూల్స్‌లో అమ్మ -ఆదర్శ పాఠశాల కమిటీల తీర్మానంతో కాంట్రాక్టర్లు చేస్తున్నారు.


ఇల్లెందురూరల్: స్లాబ్ కురవకుండా మరమ్మతు చేస్తున్న కూలీలు


జూలూరుపాడు హైస్కూల్‌లో తరగతి గదిలో నాపరాళ్లు వేస్తున్న దృశ్యం

సకాలంలో పూర్తయ్యేలా..



మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగిస్తున్నారు. 18 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా చోట్ల పనులు తుది దశకు చేరుకున్నాయి. – పిల్లి శ్రీనివాస్, ఎంఈఓ, ఇల్లెందు

నాణ్యతగా పనులు..



మరమ్మతు పనులు పూర్తయిన పాఠశాలలకు కొత్త శోభ సంతరించుకునేలా రంగులు అద్దాలని ప్రభుత్వం ఆదేశించింది. పనులన్నీ తుది దశకు చేరడంతో అన్ని పాఠశాలలకు సంబంధించి అంచనాలు రూపొందిస్తున్నాం. మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జరిగేలా నిరంతరం పర్యవేక్షించాం.

– రాంబాబు, ఏఈ, ఆర్అండ్‌బీ, ఇల్లెందు

పనులు పూర్తి చేశాం..



తరగతి గదులు, టాయిలెంట్స్ మరమ్మతులు, తాగునీటి సరఫరా పనులు పూర్తయ్యాయి. విద్యుదీకరణ పనులు పూర్తి చేసి అన్ని తరగతి గదుల్లో ఫ్యాన్లు కూడా అమర్చడం జరిగింది. వంట షెడ్డుకు రేకులు వేయాల్సి ఉంది. తీవ్ర ఎండ దృష్ట్యా పనులు నిలిచిపోయాయి. ఈ పనులు కూడా పాఠశాలలు ప్రారంభం నాటికి పూర్తి చేయిస్తాం.

– మల్కం శిరీష, అనంతారం, అమ్మ-ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్

తరగతులకు ఇబ్బంది లేకుండా పనులు..



విద్యార్థులకు ప్రత్యక్ష తరగతులు నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అమ్మ-ఆదర్శ పాఠశాలకు ఎంపికైన 25 స్కూళ్లకు గాను 13 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో పనులు అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇవి సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– గుగులోత్ వెంకట్, ఎంఈఓ, జూలూరుపాడు

క్లుప్తంగా

ఎంపీ బలరాం నాయక్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఇల్లెందు: పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఎంపీ బలరాం నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పార్టీ పట్టణ అధ్యక్షుడు డానియేల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌కోరీ, కమల్ కోరీ, జాఫర్, ఇబ్రహీం, చిల్లా శ్రీనివాస్, స్వరూప, బాదావత్ సరోజా, బోళ్ల సూర్యం, అక్తర్, లక్ష్మి, గ్రంధి సదానందం తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మానుకోట ఎంపీ పోరిక బలరాం నాయక్ పుట్టిన రోజు వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా దేవానాయక్, బండ్ల రజిని, ఇస్లావత్ రెడ్యానాయక్, బోడ సరిత, గడ్డం మధు రెడ్డి, లూనావత్ భద్రు, రజియాబేగం, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అక్రమ రవాణాను అరికట్టాలి

టేకులపల్లి: మండలంలోని జీసీసీ, రేషన్ దుకాణాల నుంచి బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారని వాటిని సంబంధిత శాఖ అధికారులు నివారించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు భూక్యా లాలు నాయక్ కోరారు. ఈ మేరకు గురువారం సంఘం నాయకులతో కలిసి మండల కేంద్రంలోని పలు రేషన్ షాపులతో పాటు జీసీసీ రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ.. అధికారులు దృష్టి సారించి రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడు హుస్సేన్ నాయక్, బానోతు నరేష్, భద్రు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి గంగబిషన్ బస్తీలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు నిర్మాణం చేపట్టిన గేటును గురువారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. దాదాపు 300 గజాల ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని అదే ఏరియాకు చెందిన కొందరు ఆక్రమించే ప్రయత్నం చేసి ఆ స్థలంలో గేటు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు తహసీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది గురువారం వచ్చి గేటును తొలగించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

సుజాతనగర్: మండలంలో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఏఓ జి.నర్మద అన్నారు. మండల కేంద్రంలోని పురుగుమందులు, ఎరువుల దుకాణాల్లో గురువారం ఆమె తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మండలంలో 12,500 ఎకరాల్లో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉందని, అన్ని షాపులలో విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. విత్తనాల విషయంలో ఏమైనా సందేహాలుంటే రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించి నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. డీలర్లందరూ విత్తన చట్టానికి లోబడి, నిబంధనలు అనుసరిస్తూ వ్యాపారం నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాలు విక్రయించరాదని తెలిపారు. గ్రామాల్లో లూజ్‌గా విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ శరత్ పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ ర్యాలీ


కొత్తగూడెంలో ర్యాలీగా వస్తున్న నాయకులు

చుంచుపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించినందుకు గాను కొత్తగూడెం పట్టణంలో బీజేపీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమై పోస్టాఫీస్ సెంటర్, బస్టాండ్ సెంటర్, సూపర్ బజార్ సెంటర్ మీదుగా ఓల్డ్ బస్ డిపో వరకు కొనసాగింది. మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానిని చేసేందుకు ప్రజలు ఆశీర్వదించారని నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, రాయుడు నాగేశ్వరరావు, పాలిశెట్టి వెంకటేశ్వర్లు, గొడుగు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ ప్రతీఒక్కరి బాధ్యత

ఇల్లెందు: అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని, ఈ అంశంలో ప్రతీ ఉద్యోగి బాధ్యతతో మెలగాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ అన్నారు. గురువారం ఇల్లెందులోని జేకే ఓసీలో ప్రమాదాల నివారణపై ప్రత్యేక భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిఏటా జూన్‌లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయని, ఈసారి అలాంటివి జరగకుండా అవగాహనతో విధుల పట్ల బాధ్యతతో మెలగటం వల్లే సాధ్యం అయిందన్నారు. పని ప్రదేశంలో జాగ్రత్తగా ఉండాలని, యంత్రాల పనిగంటలు పెంచాలని, సంస్థ ప్రకటించిన ఉత్పత్తి లక్ష్యం సాధించాలని కోరారు. విధులకు హాజరయ్యేటప్పుడు, వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, మేనేజర్ పూర్ణచందర్, అధికారుల సంఘం అధ్యక్షులు శివప్రసాద్, ప్రాజెక్టు ఇంజనీర్ చిన్నయ్య, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, గని గుర్తింపు సంఘం ప్రతినిధి సంజీవచారీ, నవీన్ పాల్గొన్నారు.

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులోని పని ప్రదేశాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కార్మికులు, ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు, ఆఫ్‌లోడింగ్ బాధ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి ఇల్లెందు ఏరియా ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య అన్నారు. ఈ మేరకు గురువారం కేఓసీలో భద్రతపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో కొన్ని సంవత్సరాలుగా జూన్‌లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న కారణంగా ఈసారి బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, మేనేజర్ రాజు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొనారు.


టేకులపల్లి: భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

'చండ్ర'తోనే భూపోరాటాలకు శ్రీకారం



చండ్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): దేశంలో భూపోరాటాలకు శ్రీకారం చుట్టి నిరుపేదలకు జీవనోపాధి కల్పించిన మహావ్యక్తి చండ్ర రాజేశ్వరరావు చిరస్మరణీయుడని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. గురువారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు జయంతిని నిర్వహించారు. చండ్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. జమీందారి కుటుంబంలో జన్మించి కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితుడై తన యావదాస్తిని పేదలకు పంచిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రేసు ఎల్లయ్య, దమ్మాలాపాటి శేషయ్య, బత్తుల సురేష్, జహీర్, గుత్తుల శ్రీను, ఇర్ఫాన్, యాకూబ్, పున్నంసింగ్, సోమయ్య, లక్ష్మి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోరాటాలే సమస్యలకు పరిష్కారం

టేకులపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని, అన్నివర్గాల ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి మండల కేంద్రంలో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజకీయ తరగతులను వారు ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, అన్నిరకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని, రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తిరిగి మూడోసారి ఎన్నికయిందని, ఫలితాలు వారు ఊహించినంతగా రాలేదని అయినా మతోన్మాద పార్టీకి కొంత మెజార్టీ వచ్చిందన్నారు.

మోదీ తీసుకొచ్చిన చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ప్రాంతాలలో బీజేపీ జమ్ము కశ్మీర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ లాంటి చోట్ల ఓడిపోయిందన్నారు. ప్రజలు పోరాటాల పటిమకే పట్టం కట్టారని తెలిపారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా సమరశీల పోరాటాలు చేయాలని, ఐక్యంగా ఉద్యమించాలని, ఆ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ రాజకీయ తరగతులలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు డి.ప్రసాద్, కే.సారంగపాణి, గౌని నాగేశ్వరరావు, ఎస్కే ఉమర్, కల్తి వెంకటేశ్వర్లు, కోరం సీతారాములు, బట్టు ప్రసాద్, పూణెం రంగయ్య, కుంజ కృష్ణ, ఎట్టి నరసింహారావు, వీరమళ్ల ఉమ, సోమ వినోద, కల్తీ సుభద్ర, వెంకటమ్మ, అలివేలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆవునూరి మధు

ఫీజులు తగ్గించాలి

కొత్తగూడెంఅర్బన్: స్థానిక సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో పెంచిన ఫీజులు తగ్గించాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఫీజులు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. పేదలకు చదువు పెద్ద భారంగా మారిందని, ప్రభుత్వాలు మారినా.. విద్య అంగడిలో సరుకుగా మారిందని, చివరికి సేవా దృక్పథంతో భారతదేశంలోకి వచ్చిన మిషనరీ స్కూళ్లు కూడా వ్యాపార ధోరణితో విద్యను వ్యాపారం చేశాయని పేర్కొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: వర్షాకాలంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని ఎంహెచ్ఎస్ పీఓ చైతన్య సూచించారు. మండలంలోని కొమరారం పీహెచ్‌సీలో గురువారం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమవుతున్నందున తక్షణం వైద్యసిబ్బంది గ్రామాలలో పర్యటించి దోమలు పెరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో జ్వరాలు అధికంగా నమోదైన గ్రామాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. గ్రామాలలో ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్య ఉత్పన్నమైనా వెంటనే స్థానిక వైద్యాధికారికి సమాచారం ఇచ్చి వెంటనే చర్యలు ప్రారంభించాలని సూచించారు. అంతేకాకుండా గ్రామాలలో గర్భిణీ, బాలింతలను స్వయంగా కలిసి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యం కలిగించాలని కోరారు. సమావేశంలో డాక్టర్ లోహిత, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైతన్య

నేడు 'బడిబాట' సమావేశం

పాల్వంచరూరల్: మండలంలో ఈనెల 6 నుంచి 19 వరకు నిర్వహించనున్న బడిబాట కార్యక్రమంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేడు శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంఈఓ, ఎంపీఓ, సీడీపీఓ, ఎస్ఐ, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు హాజరు కావాలని కోరారు.

ఏటీబీ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు

చుంచుపల్లి: ఆర్టీసీ కొత్తగూడెం, పాల్వంచ బస్టాండ్లలో దూరపు బస్ సర్వీసులను రిజర్వేషన్ కోసం ఆన్‌లైన్ చేసేందుకు గాను ఏటీబీ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను డిపో మేనేజర్ కార్యాలయం కొత్తగూడెంలో అందజేయాలని కోరారు.

యూనిఫాం అందజేత


యూనిఫాం అందజేస్తున్న ఎంపీడీఓ, ఏపీఎం

టేకులపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు గురువారం టేకులపల్లి ఎంఆర్‌సీ భవనంలో ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు చేతుల మీదుగా యూనిఫాం అందజేశారు. సెర్ప్ మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రవికుమార్, మండల నోడల్ ఆఫీసర్, సీసీలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తాండవిస్తున్నాయని, కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులకు విద్యను అందించాలని కోరారు.

'బడిబాట' పట్టిన ఉపాధ్యాయులు

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తూ మండలంలోని పలు గ్రామాలలో ఉపాధ్యాయులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు గత సంవత్సరం పాఠశాలలో చదివిని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి ప్రారంభం రోజున విద్యార్థులకు పాఠశాలలకు పంపించాలని సూచిస్తున్నారు. గ్రామంలో బడిఈడు పిల్లలను గుర్తించి తమ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు మించిన సౌకర్యాలు, సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని, అదనంగా మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేయడం, అనుభవం, అంకితభావం కలిగి ఉపాధ్యాయులచే విద్యాబోధన ప్రత్యేకతలుగా వివరిస్తున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం గురువారం మండల వ్యాప్తంగా ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అమ్మ – ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో జూలూరుపాడు న్యూకాలనీలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, గురుమూర్తి, ఉమ, సరోజని పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: చల్లసముద్రంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని 16వ వార్డు న్యూ గొల్లగూడెం కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన బడిబాట కార్యక్రమ ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చదువు మధ్యలో మానివేసిన పిల్లలను పాఠశాలల్లో చేరే విధంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జరీనా, కృష్ణయ్య, పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట ప్రదర్శనలు నిర్వహించారు. జగన్నాథపురం, నాగారంకాలనీ, దంతలబోరు ఎస్సీకాలనీ, సత్యనారాయణపురం తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నాగారంకాలనీలో హరి, దంతలబోరు ఎస్సీకాలనీలో కవిత ప్రదర్శనలో పాల్గొన్నారు.

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు పరిధిలోని బోడు సెక్టార్ సూపర్‌వైజర్ సక్కుబాయి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా బడిబాట ర్యాలీలు నిర్వహించారు. పాతర్లగడ్డ, పాతర్లగడ్డతండాల్లో చిన్నారులు, తల్లులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు.

ఇల్లెందు: పట్టణంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం పట్టణంలోని మొయిన్‌రోడ్ హైస్కూల్, జేబీఎస్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్‌లో హెచ్ఎంలు బడిబాట కార్యక్రమం చేపట్టారు. బడి బయట ఉన్న పిల్లలకు పాఠశాలల్లో చేర్పించాలని, సకల సదుపాయాలు గల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని హెచ్ఎంలు స్వామి, శర్మ కోరారు. మన పాఠశాల మనందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. 6 నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందని, అనుభవం, అర్హత గల ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, రెండు జతల యూనిఫాం అందజేత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలచే పర్యవేక్షణ, రుచికరమైన మధ్యాహ్న భోజనం, ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్, టీవీ ద్వారా బోధన, గ్రంథాలయం ఏర్పాటు లాంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.


కొత్తగూడెంఅర్బన్: చిన్నారి వివరాలను నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు


పాల్వంచరూరల్: సత్యనారాయణపురంలో బడిబాటలో విద్యార్థులు, ఉపాధ్యాయులు


ఇల్లెందు: ర్యాలీని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు